క్లుప్తంగా

కొత్తచెరువులో విగ్రహాల పరిశీలన



కొత్తచెరువులో పర్యటిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

కొత్తచెరువు: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్దనున్న మహనీయుల విగ్రహాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. విగ్రహాలతో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంపై ప్రజలు వాటిని తొలగించి వేరోచోట ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జేసీ ఆర్డీఓ సువర్ణతో కలిసి విగ్రహాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అన్ని అవకాశాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటామని జేసీ పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు విత్తనకాయలు

అమడగూరు: ఖరీఫ్‌కు సంబంధించి సబ్సిడీ విత్తన వేరుశనగ బుధవారం కస్సముద్రం, మహమ్మదాబాద్, జౌకలకొత్తపల్లి రైతుసేవా కేంద్రాలకు చేరినట్లు ఏఓ వెంకటరమణాచారి తెలిపారు. రెండు రోజుల్లో మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలకు విత్తనకాయలు రానున్నట్లు పేర్కొన్నారు. ఎకరం పైనున్న ప్రతి పాస్ పుస్తకానికి మూడు బస్తాలు, ఎకరాలోపున్న వారికి రెండు, అర ఎకరం లోపున్న రైతులకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తామన్నారు. సబ్సిడీ ధర పోను క్వింటాల్‌కు మొత్తం రూ.5,580 గా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

ముదిగుబ్బ: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ ఆదినారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్ సరఫరా, వేరుశనగ విత్తన కాయలు పంపిణీ తదితర వాటిపై చర్చించారు. మండలంలో నేటికీ ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం చేపట్టకపోవడంతో మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులను కల్పించలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. రెవెన్యూ, వైద్య, విద్యుత్, పశువైద్య శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

నల్లచెరువు: ఉప్పార్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మాధవరెడ్డి తల్లి పోలం నారాయణమ్మ (85) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి బుధవారం గ్రామానికి వచ్చి నారాయణమ్మ మృత దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేత మాధవరెడ్డిని పరామర్శించారు.

గొట్లూరును సందర్శించిన డీఎంహెచ్ఓ



గ్రామపెద్దలతో చర్చిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామాన్ని బుధవారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూల్చివేతపై ఇరువర్గాలతో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఆరోగ్యకేంద్రం ఉన్న పాత పంచాయతీ భవనాన్ని డీపీఓ, ఇతర అధికారుల అనుమతితో శాశ్వతంగా వైద్యశాఖకు కేటాయించాలని గ్రామస్తులతో చర్చించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్‌కుమార్, సీహెచ్ఓ సాంబ శివమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు యల్లప్ప, గణేష్, వీఆర్ఓ విష్ణువర్ధన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

డ్రిప్పు పైపుల అపహరణ

నల్లమాడ: చారుపల్లిలో సీ.శంకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన డ్రిప్పు పైపులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. వ్యవసాయ బోరుబావి వద్ద నిల్వ ఉంచిన 40 చుట్టల డ్రిప్పు పైపులను రెండు రోజుల క్రితం ఎత్తెళ్లినట్లు బుధవారం రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.95 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ వైద్యం..ఆరోగ్యానికి చేటు!

పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన ముత్యాలప్ప కూలి మగ్గం నేస్తూ జీవించేవాడు. అతనికి తీవ్ర అనారోగ్య సమస్యలతో కిడ్నీ సమస్యలతోపాటు షుగర్, బీపీ లాంటి జబ్బులు కూడా వచ్చాయి. దీంతో పలుమార్లు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కుటుంబ సభ్యులు వైద్యం చేయించారు. కాస్త జబ్బులు నయమైనా కూడా ఇంకా పూర్తిగా జబ్బులు తగ్గాలని మొబైల్‌లో ఆన్‌లైన్ వైద్యం వైపు మొగ్గు చూపాడు. ఆన్‌లైన్‌లో అతనికున్న జబ్బులకు సంబంధించి ఇంటిలోనే ఎలా వైద్యం చేసుకోవాలన్న సూచనలను పాటిస్తూ వచ్చాడు. చివరికి మృత్యువాతపడ్డాడు.

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ప్రతాప్‌కు 50 ఏళ్లు. అతనికి షుగర్, బీపీతోపాటు హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు ఆపరేషన్ సైతం చేయించారు. అతని ఆరోగ్యం బాగా ఉన్నా ఆన్‌లైన్‌లో వచ్చే వైద్యంపై నమ్మకం పెంచుకుని ఆన్‌లైన్‌లో సూచించిన మందులను వాడటం మొదలుపెట్టాడు. చివరికి మరోసారి గుండెపోటు వచ్చి మృతి చెందాడు.

పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన నారాయణస్వామి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. ప్యారాసిట్‌మాల్ వేసుకున్నా తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. అయినా జ్వరం మళ్లీ వస్తుండటంతో అతని కుమారుడు ఆన్‌లైన్‌లో జ్వరం తగ్గేందుకు సూచించే వైద్యాన్ని అనుసరించి ఇంటిలోనే వైద్యం చేసుకున్నాడు. చివరికి అతనికి జ్వరం తీవ్రత ఎక్కువై బెంగళూరు ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఇంటర్‌నెట్‌లో చూసి సొంత వైద్యం చేసుకుంటున్న జనం
- పరిస్థితి విషమించడంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్న వైనం

ధర్మవరం అర్బన్: గతంలో ఆన్‌లైన్, ఇంటర్‌నెట్ వల్ల చిన్నపిల్లలు చెడిపోతారని, కుటుంబాలలో సమస్యలు వస్తాయని చెప్పేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ వైద్యంతో ప్రజలు సైతం సొంత వైద్యం చేసుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ధర్మవరం పట్టణంలోని చాలా మంది ప్రజలు ఆన్‌లైన్ వైద్యానికి అలవాటు పడుతున్నారు. ఆన్‌లైన్ వైద్యాన్ని నమ్మి చివరికి నిజమైన వైద్యులు చెప్పే వైద్యాన్ని అనుమానించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ టెక్నాలజీ రాకమునుపు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్‌ఎంపీలు ఇలా అందుబాటులో ఉండే వైద్యుల వద్ద రోగులు వైద్యం చేయించుకునేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఉచితంగా దొరకడంతోపాటు ఏఐ టెక్నాలజీ ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండటంతో ప్రజలు ఆన్‌లైన్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇంట్లోనే కూర్చుని వారు చెప్పే వాటిని పాటిస్తే జబ్బులు నయమవుతాయని నమ్ముతున్నారు. కొంతమంది ఉన్న జబ్బులకు వైద్యం చేసుకోవడం, మరికొందరు ఉన్న జబ్బుకు సంబంధించి ఏదైనా ఆన్‌లైన్‌లో సూచిస్తే జబ్బు ఒకటి ఆన్‌లైన్‌లో మందులు మరొకటి సూచిస్తున్నా అవి వాడుతూ ప్రజలు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో సూచించిన మందులను వాడటం వల్ల రోగాన్ని మరింత కఠినతరం చేసుకుని చివరికి ఆపరేషన్ల వరకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్ వైద్యం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని వైద్యులు సూచిస్తున్నా ప్రజలు పెడచెవిన పెడుతున్నారు.

నేరుగా వైద్యుడు పరీక్షించి వైద్యం అందిస్తేనే..

వైద్యుల వద్దకు రోగి వెళినప్పుడు అతనిని అన్ని విధాలా పరీక్షించి వైద్యుడు జబ్బుకు సంబంధించిన మందులు అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుతారు. కాని ఆన్‌లైన్‌లో మాత్రం మనకు ఉన్న జబ్బుకు ఆన్‌లైన్‌లో చెప్పే మందులకు పొంతన లేకుండా పోతోంది. నేరుగా వైద్యుడి వద్దకు వెళ్లి వైద్యం చేయించుకుంటే డబ్బు ఎక్కువ ఖర్చు అవుతాయని భ్రమపడి ఆన్‌లైన్‌లో అయితే తక్కువ ధరలకే మందులు ఇంటి వద్దకే వస్తాయని ఆశ పడి ప్రజలు రోగాలను మరింత జటిలతరం చేసుకుంటున్నారు. వైద్యులు రోగిని స్వయంగా పరీక్షించి అవసరమైతే రక్తపరీక్షలు, ఇతరత్రా పరీక్షలు చేసి రోగాన్ని నిర్ధారించిన అనంతరం చికిత్సలు చేసి రోగాన్ని నయం చేస్తారు డాక్టర్లు. కాని ఆన్‌లైన్‌లో మాత్రం మనం జబ్బు పేరు చెబితే వారు అందుకు సంబంధించిన వైద్యాన్ని వందల సంఖ్యలో చెబుతారు. వాటిలో ఏది తక్కువ వైద్యం అనిపిస్తుందో ఆ ఆన్‌లైన్ వైద్యాన్ని రోగులు ఎంచుకుని రోగాన్ని పెంచుకుంటున్నారు.



ధర్మవరం ముఖచిత్రం

మున్సిపాలిటీ	: ధర్మవరం
వార్డులు	: 40 వార్డులు
జనాభా	: 1,60,000
నివాసాలు	: దాదాపు 80 వేలు
ఆన్‌లైన్‌లో వైద్యం పొందేవారు	: దాదాపు 20 వేల మంది

ఆన్‌లైన్ వైద్యంతో పెను ప్రమాదం



ఆన్‌లైన్‌లో ఒకే జబ్బుకు పలు రకాల చికిత్సలు చెబుతుంటారు. ఆన్‌లైన్ వైద్యంతో ప్రాణానికే ముప్పు వాటిల్లుతుంది. మనకు జబ్బు ఒకటి ఉంటే ఆన్‌లైన్‌లో మరో జబ్బుకు వైద్యం చెబుతారు. నాలుగైదు జబ్బులకు ఒకే రకమైన వైద్యం చెబుతుంటారు. వాటిని పాటించడం ప్రమాదం. ఆన్‌లైన్‌లో మాత్రలు, మందులు కొనుగోలు చేసి ప్రజలు తమ ఆరోగ్యాన్ని మరింత అనారోగ్యంగా మార్చుకుంటున్నారు. రోగికి ఉన్న లక్షణాలను బట్టి వ్యాధిని నిర్ధారణ చేయలేం. ఒకే రకమైన లక్షణాలు అనేక రోగాల్లో ఉంటాయి. రోగిని నేరుగా పరీక్షించి పలు పరీక్షలు చేసి వచ్చిన రిపోర్టులను బట్టి వ్యాధి నిర్ధారణ చేయగలం. ఆన్‌లైన్‌లో చూసి సొంతంగా వైద్యం చేసుకుంటే ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది.

– డాక్టర్ మాధవి,
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ధర్మవరం

1న ఆర్డీటీ సేవల సంఘీభావ ర్యాలీ

ధర్మవరం అర్బన్: ఆర్డీటీ సేవలను తెలియజేస్తూ జూన్ ఒకటో తేదీన పట్టణంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పోలా ప్రభాకర్, డాక్టర్ బీవీ సుబ్బారావు, శీలా నాగేంద్ర, స్వచ్ఛంద సంస్థల కోఆర్డినేటర్ సత్యనిర్ధారణ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ప్రభుత్వ బాలుర పాఠశాలలో 'సామాజిక అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర' అనే అంశంపై సమావేశం నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఆర్డీటీ సేవల సంఘీభావ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ర్యాలీ అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి పట్టణంలో సాయి ఆరామంలో ఎన్టీఆర్ 102 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అలాగే ఎస్పీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి ఆర్ఐలు వలి, మహేష్ తదితరులుపాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతి

చెన్నేకొత్తపల్లి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని మండల వ్యాప్తంగా నిర్వహించారు. మండల పరిషత్‌కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలక్రిష్ణుడుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం



పుట్టపర్తి పట్టణ అనుబంధ విభాగాల అధ్యక్షులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి రూరల్ అనుబంధ విభాగాల అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణ, రూరల్ కన్వీనర్లు రవి నాయక్, ఈశ్వరయ్య సమక్షంలో వివిధ అనుబంధసంఘాల అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో కార్యకర్తలు ముందుండాలన్నారు. అనంతరం పట్టణ యూత్ వింగ్ అధ్యక్షుడు సందీప్‌నాయుడు, మహిళా విభాగం జి.భారతి, రైతు విభాగం డి.ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ సి.శంకర్, ఎస్సీ సెల్ జి.నరేష్, ఎస్టీ సెల్ రామస్వామినాయక్, మైనార్టీ సెల్ నిజాంవలి, క్రిష్టియన్ మైనార్టీ సెల్ గంగాధర్, స్టూడెంట్ వింగ్ తుంగా హరిప్రకాశ్, పంచాయతీ వింగ్ సోమ్లానాయక్, మున్సిపల్ వింగ్ పి.నాగిరెడ్డి, ఆర్టీఐ వింగ్ కె. జనార్దన, వలంటీర్ వింగ్ మత్యాలు, వీవర్స్ వింగ్ ఆర్.రామాంజనేయులు, వాణిజ్య విభాగం రాఘవేంద్ర, వైఎస్సార్‌టీయూసీ రమేష్, అంగన్‌వాడీ వింగ్ కె.ఉమామహేశ్వరి, కల్చరల్ వింగ్ గంగిశెట్టి, సోషల్, మెడికల్ వింగ్ గంగాధర్, దివ్యాంగుల విభాగం వింగ్ బి.కేశవరెడ్డి, పబ్లిసిటీ వింగ్ ఎం. గోపాల్‌రెడ్డిలను సన్మానించారు. అలాగే పుట్టపర్తి రూరల్ యూత్ వింగ్ అధ్యక్షుడు కె. విజయకుమార్‌రెడ్డి, , మహిళా విభాగం వై .మంజుల, రైతు విభాగం కె. క్రిష్ణమూర్తిరెడ్డి, బీసీ సెల్ టి.నరేష్, ఎస్సీసెల్ సి.గంగప్ప, ఎస్టీ సెల్ జి. అనంద్‌నాయక్, మైనార్టీ సెల్ పి. రోషన్‌ఖాన్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ సి.బాలకృష్ణ, స్టూడెంట్ వింగ్ ఎస్ మహేష్‌బాబు, పంచాయతీ వింగ్ వి.కుళ్లాయిరెడ్డి, ఆర్టీఐ వింగ్ ఎస్ రాజశేఖర్‌రెడ్డి, వలంటీర్ వింగ్ పి.శివానంద, వీవర్స్ వింగ్ జి. సాయిరామ్, వాణిజ్య విభాగం వెంకటేష్, వైఎస్సార్ టీయూసీ బి. చంద్ర, అంగన్‌వాడీ వింగ్ డి. భార్గవమ్మ, కల్చరల్ వింగ్ చంద్రశేఖర్, సోషల్, మెడికల్ వింగ్ డి.లోకనాథ్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం వింగ్ ఆర్ మస్తాన్, పబ్లిసిటీ వింగ్ సి. భానుప్రకాశ్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, ఎంపీపీ పీవీ రమణారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కుమారి, మాజీ మండల కన్వీనర్లు గంగాద్రి, నరసారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత,చెరువు భాస్కర్ రెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, అగ్రీ అడ్వైజరీ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు

ధర్మవరం అర్బన్: యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఎంపీడీఓ సాయిలు తెలిపారు. పట్టణంలోని క్రీడా మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్యసాయి జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి సమక్షంలో యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ, కమిషనర్, ఎంపీడీఓలు హాజరై యోగాసనాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉదయం లేవగానే యోగా సాధన చేయాలని సూచించారు.

తలుపుల : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తహసీల్దార్ రెడ్డిశేఖర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తహసీల్దార్, ఎంపీడీఓ హసీనా ఆధ్వర్యంలో ట్రైనర్ శివప్రకాష్ ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇచ్చారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు



రోడ్డు నిర్మాణ పనులను ఆపి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ముదిగుబ్బ: పుట్టపర్తి–ముదిగుబ్బ మధ్యన జరుగుతున్న జాతీయ రహదారి 342 రోడ్డు పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పెంచిన తరువాతనే పనులు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ డీఈ గిడ్డన్నను పరిహారంపై నిలదీశారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ఎకరానికి రూ.కోటి ఉందన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఎకరానికి కేవలం రూ.12 లక్షలను మాత్రమే చెల్లిస్తోందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం పెంచేలా చర్చిస్తామని అధికారులు తెలిపారు. అయితే తమకు న్యాయం జరగకపోతే రోడ్డు పనులను అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు. వీరికి బీజేపీ నాయకులు నాయకులు సోమల ప్రకాష్ నాయుడు, సనత్‌కుమార్, విశ్వనాథ్, ప్రభాకర్ నాయుడు, టీవీ రమణ, రాగే నాయుడు, హనుమంతు, రఘుశాస్త్రి మద్దతు ప్రకటించారు.

నిర్ణీత ధరకే సినిమా టికెట్లు విక్రయించాలి



థియేటర్లలో తినుబండారాలను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే సినిమా టికెట్లు విక్రయించాలని, కొత్త సినిమా రిలీజ్ అయిన సమయంలో బ్లాక్ టికెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ హెచ్చరించారు. పట్టణంలోని రంగా థియేటర్, వరలక్ష్మి, సిద్దార్థ థియేటర్లను బుధవారం ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. టికెట్ల ధరలను పరిశీలించారు. థియేటర్లలో ఉన్న మరుగుదొడ్లను, పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని థియేటర్ల నిర్వాహకులకు సూచించారు. కొత్త సినిమాలు రిలీజ్ అయినప్పుడు బ్లాక్ టికెట్లు విక్రయించరాదన్నారు. అనంతరం ఫైర్ సేఫ్టీని తనిఖీ చేశారు. థియేటర్లలో విక్రయించే తినుబండారాల నాణ్యతను పరిశీలించిన ఆర్డీఓ ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తుంటే రసీదు ఇస్తున్నారా, పార్కింగ్ ఫీజుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉందా అని ఆరా తీశారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, వీఆర్వో రవి తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

తనకల్లు: చీకటిమానిపల్లి వద్ద బుధవారం జరిగిన జరిగిన ప్రమాదంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... చీకటిమానిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉదయం ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వెళ్తుండగా గాలి వేగంగా వీచడంతో టాప్ విరిగి అతని మీద పడింది. దీంతో సుధాకర్ వీపు, నడుముకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'వైద్యాధికారిపై ఆరోపణలు సరికాదు'

పుట్టపర్తి అర్బన్: శ్రీ సత్యసాయి డీఎంహెచ్ఓపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం పేర్కొంది. బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'వైద్య, ఆరోగ్య శాఖలో లేఖ దుమారం' వార్తకు జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం స్పందించింది. వారు మాట్లాడుతూ డీఎంహెచ్ఓపై ఆరోపణలు చేయదలిస్తే పక్కా ఆధారాలను చూపించాలన్నారు. కుల ప్రస్తావన, వాహనాల వాడకం, నిధుల దుర్వినియోగం, ఆసుపత్రుల నుంచి డబ్బు వసూలు వంటి వాటిపై ఆధారాలు చూపించాలన్నారు.

ఆర్టీసీ డిపో తనిఖీ



ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న ఈడీ అప్పలరాజు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోను ఆర్టీసీ ఈడీ(ఆపరేషన్స్) అప్పలరాజు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అత్యధిక ఆదాయం వచ్చే రూట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు ఆయన వెంట డీపీటీఓ మధుసూదన్, డీఎం మైనోద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉద్యోగుల సమస్యలు తీర్చాలని కోరుతూ ఈయూ నాయకులు నబీరసూల్, జీవైపీరావ్, ఆర్.రెడ్డి, కొండారెడ్డి, అక్బర్‌ఖాన్, దివాకర్ ఈడీకి వినతిపత్రం అందజేశారు.

సోలార్ ప్లాంట్లకు భూములు గుర్తించండి

కనగానపల్లి: మండలంలో సోలార్ విద్యుత్‌తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ రెవెన్యూ, వ్యవసాయాధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ కనగానపల్లి మండలంలో దాదాపు రెండు వేల ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకు అవసరమైన భూములను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. దీనిపై గ్రామ రెవెన్యూ, సర్వే, వ్యవసాయ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ కరుణాకర్, ఆర్ఐ సరళ, పలువురు వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

ధర్మవరం రూరల్: పట్టణంలోని యర్రగుంట సర్కిల్ వద్ద బుధవారం చెన్నేకొత్తపల్లి నుంచి ధర్మవరం వస్తున్న ఆటోకు కుక్క అడ్డురావడంతో కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమ్మ, రాములమ్మ, జుబేర్, మూర్తి, మేడాపురం గ్రామానికి చెందిన రాజమ్మ గాయపడ్డారు. గాయపడిన వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఆటోడ్రైవర్ మూర్తి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ శివారులోని నాలుగు మోరీల వద్ద బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పొడరాళ్లపల్లికి చెందిన సాయి, తిమ్మనాయనిపాలెంకు చెందిన చింటూ బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడ్డారు. క్షతగాత్రులను 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

టీకాలు తప్పనిసరిగా వేయించండి

తాడిమర్రి: చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ లలితమ్మ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం అన్ని విలేజ్ క్లీనిక్‌ల్లో ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు ప్రతి బుధవారం, శనివారం టీకాలు వేస్తామన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ చేయండి

ధర్మవరం రూరల్: రైతులకు విత్తన వేరుశనగ కాయలను విరివిగా పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ఎస్‌హెచ్‌బాషా, జేవీ రమణ, మారుతి సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: సకాలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కనగానపల్లిలో రైతు సంఘం మండల నాయకులు గోవిందు, నాగరాజు, మల్లికార్జునతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా ప్రభుత్వం ఇంతవరకు సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేయలేదన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న కమిషనర్ క్రాంతికుమార్

పుట్టపర్తి టౌన్: పట్టణంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని కమిషనర్ క్రాంతికుమార్ శానిటేషన్ అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో తమ చాంబర్‌లో శానిటేషన్ అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పుట్టపర్తికి సత్య సాయి బాబా మహాసమాధి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్‌ను నిషేధించామని, వారంలో మూడు రోజులు తనిఖీలు చేపట్టాలన్నారు. అలాగే తడి చెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శానిటేషన్ అధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.